నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఆదిలాబాద్అర్బన్, డిసెంబరు 12 : భుక్తాపూర్‌లోని కరెంట్ ఆఫీస్‌లో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్) ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల సమస్యలు, లోఓల్టేజీ, ఇతర సమస్యలను లిఖిత పూర్వకంగా విన్నవించుకుని, పరిష్కారం పొందవచ్చని సూచించారు.



అవినీతి.. పంచాయతీ!

- జిల్లాలో నిధుల దుర్వినియోగంతో ఇద్దరు సర్పంచ్‌ల తొలగింపు
- విచారణ పేరిట ఏళ్ల తరబడి కాలయాపన
- ప్రజాధనం దుర్వినియోగంపై పట్టింపు కరువు
- రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

ఆదిలాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రగతిని పరుగులు పెట్టించాల్సిన వారే అవినీతి పంచాయతీకి తెరలేపుతున్నారు. కొందరు సర్పంచ్‌లు ఆత్యాశతో అక్రమ సంపాదనకు ఆరాట పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల్లో ఎన్నో బాసలు, హామీలు ఇచ్చి గెలుపొందిన తర్వాత ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి పై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడే నాలుగు పైసలు వెనుకేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు కనిపిస్తోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో పలువురు సర్పంచ్‌ల పై అవినీతి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు అవినీతి ఆరోపణలు నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్‌లపై చర్యలు చేపట్టక పోవడంతో తేలికగానే తీసుకుంటున్నారు. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 5 లక్షలకు పైగా గ్రామీణ జనాభా నివసిస్తున్నారు. జిల్లాలో నలుగురు మంది సర్పంచ్‌లపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ చేపట్టిన అధికారులు కేవలం ఇద్దరు సర్పంచ్‌లను మాత్రమే పదవి నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. మరో 8 మంది ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేశారు. లక్షల రూపాయలు దుర్వినియోగమవుతున్నా రికవరి చేయడంలో నిండు నిర్లక్ష్యం కనిపిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు వెనుకాడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు సర్పంచ్‌లపై వేటు

పంచాయతీల పాలకవర్గ పదవి కాలం ముగిసినా దుర్వినియోగమైనా నిధులపై విచారణ కొనసాగుతునే ఉంది. కేవలం ఇద్దరు సర్పంచ్‌ల పైననే వేటు వేసి పదవి నుంచి తొలగించారు. ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామ పంచాయతీలో రూ.30లక్షల 70వేల 773 నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించిన అధికారులు ఆ గ్రామ సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించారు. అలాగే చందూరి గ్రామ పంచాయతీ సర్పంచ్ కోర్టు ఆర్డర్‌ను దిక్కరించడం అలాగే ఎన్నికల సమయంలో నకిలీ సర్టిఫికేట్‌ను జతపర్చడంతో విచారణ జరిపిన అధికారులు సర్పంచ్‌పై వేటు వేసి తొలగించారు. గడిచిన ఐదేళ్లలో నలుగురు సర్పంచ్‌లు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన ఇద్దరి పైననే వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. 1992 నుంచి ఇప్పటి వరకు 43 మంది సుమారుగా కోటి రూపాయల వరకు పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారుల పర్యవేక్షణలో తేలిన చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. షోకాజ్ నోటీసులను ఇస్తూ వదిలేయడంతో నిధుల దుర్వినియోగం పునరావృతమవుతునే ఉంది. ఇకనైనా పంచాయతీ రాజ్ అధికారులు అవినీతికి పాల్పడుతున్న సర్పంచ్‌లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే పంచాయతీల్లో అవినీతి కొంత మేరకైనా తగ్గుముఖం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకసారి అవినీతికి పాల్పడిన వారిని మళ్లీ పోటీ చేయకుండా అడ్డుకుంటే కొంతవరకైనా మార్పువచ్చే అవకాశం ఉందంటున్నారు.

రికవరీపై జాప్యం ఎందుకు?

ఏటా లక్షల రూపాయల పంచాయతీ నిధులు దుర్వినియోగమవుతున్న అధికారులకు పట్టింపు కరువవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తిస్తున్న అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తూ వదిలేస్తున్నారు. ఆ తర్వాత రికవరీపై దృష్టి సారించక పోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. విచారణ పేరిట ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి ఏడాది గడుస్తున్నా నయా పైసా కూడా రికవరీ చేయలేదంటే పరిస్తితి ఎలా ఉందో అర్థమవుతునే ఉంది. అలాగే రాజకీయ ఒత్తిళ్లు పెరిగి పోవడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాల్సిన అధికారులు అవేమి పట్టించుకోక పోవడంతో అక్రమాలకు పాల్పడిన పలువురు సర్పంచ్‌లు యథేచ్ఛగా గ్రామాల్లో చలామణి అవుతున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు ముందే దుర్వినియోగమైన నిధులపై అధికారులు దృష్టి సారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల్లో భారీగా ఖర్చు

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటాపోటీగా భారీగా ఖర్చు చేయడం గెలిచిన తర్వాత అవినీతి అక్రమాలకు పాల్పడడం పరిపాటిగానే మారిందంటున్నారు. ఎన్నికల్లో ఖర్చుపెట్టిన సొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు అక్రమ సంపాదనకు ఆరాట పడుతున్నారు. అప్పులు చేసి మరీ ఎన్నికల్లో ఖర్చు చేయడం అపైగా అవినీతికి పాల్పడడం కొందరికి మామూలుగానే మారిందంటున్నారు. అలాగే అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్థిరాస్థి వ్యాపారంలోను రాణిస్తూ అక్రమ ఆస్తులను కూడబెట్టుకుంటున్నారనే విమర్శలు లేక పోలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ రుణాలను వదిలి పెట్టడం లేదంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన దళితబంధు, బీసీ బంధు, దళితబస్తీ, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకాల్లో కొందరు సర్పంచ్‌లు భారీ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం, మండల కేంద్రాలను ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీల పరిధిలో వెంచర్లను ఏర్పాటు చేయడంతో నిబంధనల పేరిటా అడ్డగోలు సంపాదనకు ఎగబడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం



- శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అక్రమాలను గుర్తించి సంబంధిత సర్పంచ్‌లకు నోటీసులు జారీ చేయడం జరిగింది. గడువు సమయంలో దుర్వినియోగమైన నిధులు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి. రాబోయే ఎన్నికల్లో పోటీకి ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మళ్లీ నోటీసులు ఇచ్చి రికవరీ చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశిస్తాం.

ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడికి గురికావద్దు

- డీఆర్‌డీవో సాయన్న


మహేష్‌కుమార్‌ని సన్మానిస్తున్న డీఆర్డీఓ సాయన్న

ఉట్నూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న కార్యదర్శులు పనిఒత్తిడికి గురికావద్దని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్ బేల మండలానికి బదిలీపై వెళ్తుండగా అధికారులు కార్యదర్శులు ఆయనను ఘనంగా సన్మానించారు. కొత్తగా వచ్చిన ఎంపీవో సుధీర్‌కుమార్‌ను కూడా స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, పరిపాలనాధికారి శ్యామసుందర్, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్ కార్యదర్శులు పాల్గొన్నారు.

దొర్లి శివారులో పెద్దపులి సంచారం

తలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం డోర్లీ గ్రామపంచాయతీ శివారు ప్రాంతంలో గురువారం సాయంత్రం వ్యవసాయ పొలాల్లో పెద్దపులి గాండ్రింపు చప్పుడు వినిపించిందని రైతులు అన్నారు. రైతులు భయపడి తొందరగా గ్రామాల్లోకి చేరుకొని గ్రామపెద్దలకు సమాచారం అందించడంతో గ్రామపెద్దలు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, నల్ల పద్మకర్ రెడ్డిలు జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు స్పందించి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. శుక్రవారం తమ సిబ్బందితో కలిసి పంట పొలాలు అటవీప్రాంతంలో సంచరిస్తామని వారు తెలిపారు. అదేవిధంగా రాత్రివేళ రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెద్దపులి, చిరుత పులులు, ఎలుగుబంట్లు ఆదివాసి గిరిజన గ్రామాల్లో సంచరిస్తున్నాయి. కోసాయి, దేగమ్మ, ఉమ్రి, కప్పర్ దేవి, రత్నాపూర్, కుచలాపూర్ తదితర గ్రామాల్లో చిరుతపులులు సంచరించి పలు పశువులపై దాడి చేసిన సంఘటనలున్నాయి. అటవీ శాఖ అధికారులు తొందరగా స్పందించి పులుల నుంచి రైతులకు కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.

'బాల్యవివాహం చట్టరీత్యా నేరం'

బజార్‌హత్నూర్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి) 12: బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని ఎస్సై అప్పారావు తెలిపారు. మండలకేంద్రంలో బాలికకు బాల్య వివాహం చేస్తున్నారని 1098 చైల్డ్‌లైన్ నెంబర్‌కు సమాచారం అందించగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వామి, సిబ్బంది బాలిక స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వివాహాన్ని అడ్డుకుని బాలికను జిల్లాలోని బాలికల సంరక్షణ గృహానికి తరలించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని, ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు చేపడతామన్నారు. కౌన్సెలింగ్ ఇచ్చిన వారిలో సిబ్బంది సతీష్, అయ్యప్ప తదితరులు ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారుల కోసం గ్రామాల్లో సర్వే

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదలసొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తొలుత అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు వర్తింపజేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. లబ్ధిదారుల పారదర్శక ఎంపిక కోసం కోసం సర్వే చేపడుతోంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణంలో వార్డు అధికారులకు దీని బాధ్యతలను అప్పగించింది. ఇందు కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించిన ప్రభుత్వం నేరుగా ఆన్‌లైన్‌లోనే వివరాలను నమోదు చేయిస్తోంది. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చందా(టీ), భీంసరి గ్రామాలతోపాటు పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌లో కొనసాగుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రీసర్వే సిబ్బందితో కలిసి పేదలతో మాట్లాడి వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు, సభ్యుల సంఖ్య, ప్రస్తుతం నివాసముంటున్న ఇంటి పరిస్థితి, నివాసయోగ్యంగా ఉందా వంటి వివరాలను ఆరా తీశారు. సొంత ఇంటి స్థలం ఉందా ఉంటే దానికి సంబంధించిన ధ్రువపత్రాలు, అవి లేని పక్షంలో ఇంటి పన్ను రసీదులు, తెల్ల రేషన్‌కార్డు వివరాలను పరిశీలించారు. లబ్ధిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబంధించిన చిత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తొలుత గిరిజనులు, దళితులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఉపాధి కూలీలు, పారిశుధ్య కార్మికులకు ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినందున వారి వివరాల నమోదుకు ప్రాధాన్యామిస్తున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి పద్మ భూషణ్ రాజు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో స్వప్నశీల, చాంద(టి), భీంసరి గ్రామపంచాయతీల కార్యదర్శులు రాఖి, మల్లా రెడ్డి, పాల్గొన్నారు.

ఆదివాసీలు విద్యకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

నార్నూర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామ ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబం ధాలు మెరుగుపరచాలని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. నార్నూర్ మండలఖైరదాట్వా గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత దుప్పట్లు పంపిణీ కార్య క్రమంలో ఎస్పీ గౌస్‌ఆలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటగా జిల్లా ఎస్పీ ఉట్నూర్ సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్‌లకు ఆదివాసీలు డప్పు వాయిద్యాల నడుమ, సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. కొమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా వాలీబాల్ క్రీడను జిల్లా ఎస్పీ అధికారుల సమక్షంతో ప్రారంభించారు. తదుపరి దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలు చదువుపై ప్రాధాన్యత కేటాయించి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత ముఖ్యంగా మాదక ద్రవ్యాల వ్యసనాల భారీన పడకుండా చదువుపై దృష్టి సారించి తమ కుటుంబాల అభివృద్ధికి పాటు పడాలని ఆకాంక్షించారు. రైతులు దళారుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, గంజాయి పండించడం, సేవించడం అమ్మడం లాంటి వాటికి దూరంగా ఉండాలని కోరుకున్నారు. యువత వ్యసనాల భారీన పడి తమ భవిష్యత్తును కోల్పోకుండా వాటికి దూరంగా ఉండాలని తెలియజేశారు. ప్రజలు పంట పొలాలలో అక్రమంగా కరెంట్ తీగలను ఏర్పాటు చేయడం వలన ప్రాణనష్టం సంభవిస్తుందని వాటిని ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. దుప్పట్ల కొనుగోలులో సహకరించిన అగ ర్వాల్ సమాజ్ ట్రస్టు హైదరాబాద్ వారికి ప్రత్యేక అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబుల్లా ప్రస్తుతం సైబర్‌క్రైమ్ బారీనపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు సవివరంగా వివరించారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్, అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్, డీఎస్పీలు సీహెచ్‌నాగేందర్, హసిబుల్లా, జిల్లా సార్‌మేడి మేస్రందుర్గుపటేల్, సీఐలు రహీంపాషా, మొగిలి, ఇంద్రవెల్లి ఎస్సై సునిల్, ఆదివాసీ దాదిరావు, కనక ప్రభాకర్, శ్రీరామ్ మండవి, చంద్రహారి శేఖర్‌రూపుదేవ్‌కోరల మహేందర్, పెందూర్ సంతోష్ పాల్గొన్నారు.


దుప్పట్లను పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షుని హోదాలో తమకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రతి నిత్యం వివిధ రూపాల్లో నిరసనను తెలియజేస్తున్న ఉద్యోగులు గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్దనున్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి తమ నిరసనను వ్యక్తం చేశారు. రెగ్యులర్ చేస్తామని మీరే మాటిచ్చారు కదా అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రమని, 129 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా అమరులయ్యారని, అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమని పడాల రవీందర్ అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవదర్శన్, వినోద్, ప్రకాష్, కేశవ్, ప్రియాంక, మల్లిక, సలీం, సందీప్, సురేందర్, వెంకన్న పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం


సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపీడీవో

తాంసి , డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలలో ఏవైనా తప్పులుంటే తమ కు తెలియజేయాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలలో పోలిం గ్ బూత్‌లను కూడా పరిశీలించడం జరిగిందని ఏవైనా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉంటే ముందుగానే తెలుపాలని కోరారు.

బోథ్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గురువారం ఎంపీడీవో రమేష్ కార్యాలయంలో రాజకీయ పార్టీల వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాతో పాటు ఎన్నికలకు ముందు తీసుకునే చర్యల గురించి రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఆయా గ్రామాలలో ఇప్పటికే ఓటరు జాబితా ప్రదర్శించడం జరిగిందని వార్డుల వారీగా వివరాలు అందించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.గంగాధర్, షేక్ అలీ, గడ్డల నారాయణ, సీపీఐ నాయకులు గోవర్ధన్, టీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఆదిలాబాద్అర్బన్ :ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16న జిల్లా వ్యాప్తంగా గ్రూప్ -2 పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షల కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండవద్దని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించవద్దని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసి వేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గణిత మేధావి రామనుజన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో భాగంగా ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి మాథ్స్ టాలెంట్ టెస్ట్, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా విద్యాశా ఖాధికారి ప్రణీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గణిత ప్రతిభ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో నర్సయ్య, సోమయ్య, సుదర్శన్, రఘు రమణ, గిరిష్, యాదగిరి, తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షులు దిలీప్ రెడ్డి, కిషన్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక నాయకులకే చైర్మన్ పదవి ఇవ్వాలి'


సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన నవీన్ రెడ్డి

మావల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి స్థానిక నాయకులకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నలిమెల నవీన్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. చైర్మన్ పదవిని స్థానికేతరులకు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీ కోసం తాను కష్టపడి పనిచేశానని, తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసు కెళ్లినట్లు నవీన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

సీతక్కా.. ఇవీ సమస్యలు!

- నిలిచిపోయిన బాసర ఆలయ మాస్టర్ ప్లాన్
- గత ప్రభుత్వం ఇచ్చిన రూ. 42 కోట్లు వెనక్కి తీసుకోవడంతో పనులకు ఆటంకం
- పర్యాటకంగా అవకాశం ఉన్నా ఆసరా కరువు
- ట్రిపుల్ ఐటీలో సమస్యల తిష్ట
- కొత్త మండల వాసులకు అన్నీ సమస్యలే
- నేడు బాసరలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పర్యటన





బాసర సరస్వతీ అమ్మవారి దేవాలయం

బాసర, డిసెంబరు, 12: (ఆంధ్రజ్యోతి) : బాసర.. జిల్లాకే తలమానికం. ఒక పక్క ప్రముఖ పుణ్యక్షేత్రం, మరో పక్క ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీకి నెలవైన బాసర అభివృద్ధి గత కొంతకాలంగా కుంటుపడింది. ప్రత్యేకరాష్ట్రంలోనైనా అభివృద్ధి చెందుతుందని భావించిన స్థానికులకు నిరాశే ఎదురైంది. దేశంలోనే రెండో ప్రాచీన సరస్వతీ ఆలయం ఉన్న బాసర పుణ్యక్షేత్రంలో వచ్చిన యాత్రికులకు సరిపడేలా వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో అనేక దేవాలయాలు రూపాయల కోట్ల అభివృద్ధి పనులకు నోచుకుంటే బాసర మాత్రం వెనుకబడింది. చిన్నచిన్న ఆలయాలు సైతం అక్కడి స్థానిక నాయకులు ప్రత్యేకశ్రద్ధతో రూపురేఖలను మార్చేశారు. కాని రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన బాసర క్షేత్రానికి నిర్లక్ష్యపు నీడన కొనసాగుతుంది. స్థానికుల విన్నపం మేరకు గత ప్రభుత్వం రూపాయలు 50 కోట్లు కేటాయించింది. మొదటి దశగా వచ్చిన ఈ నిధులతో అమ్మవారి ఆలయ మాస్టర్‌ప్లాన్ పనులు ప్రారంభించే దశలోనే ప్రభుత్వాలు మారిపోయాయి. ఆ నిధుల్లో మిగిలిన రూ.42 కోట్లను ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో బాసర అభివృద్ధి కథ మళ్లీ మొదటికి వచ్చింది. నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. షరా మామూలే అన్నట్లు భక్తులకు కష్టాలు కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన యాత్రికులు ఇక్కడ సరైన వసతులు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆలయం చిన్నగా ఉండడం భక్తుల రద్దీ పెరగడంతో వచ్చిన యాత్రీలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. కనీసం తాగేందుకు నీరు దొరకని దుస్థితి. అధికంగా రద్దీ ఉండే ఉత్సవదినాల్లో, వేసవి సెలవుల్లో భక్తుల కష్టాలు రెట్టింపవుతున్నాయి. గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.42 కోట్ల నిధులు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క చొరవ తీసుకుంటే బాసర ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ నిండా సమస్యలే..

రాష్ట్రంలో ఉన్న ఏకైక ఆర్జీయూకేటీ (ట్రిపుల్‌ఐటీ) బాసరలో ఉంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద వర్గాలకు చెందిన 9 వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2008 సంవత్సరంలో బాసరలో ఈ ట్రిపుల్ ఐటీ ఏర్పాటైంది. గ్రామీణ పేద విద్యార్థులకు ఉచితంగా సాంకేతిక విద్యను అందించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో ఈ ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసింది. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తర్వాత బడ్జెట్‌లో ట్రిపుల్ ఐటీలకు నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ప్రారంభంలో ఉన్న వసతి సౌకర్యాల్లోనే విద్యార్థులు నేటికీ కొనసాగుతున్నారు. ట్రిపుల్ ఐటీ ఏర్పడి 16 సంవత్సరాలు గడిచిపోవడంతో అక్కడ మౌలిక వసతులన్నీ మరమ్మతుల స్థితికి చేరాయి. నిధులు లేక విద్యార్థులు అసౌకర్యాల మధ్యనే చదువులు కొనసాగిస్తున్నారు. అధికారులకు సమస్యలు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే తప్ప ట్రిపుల్ ఐటీలో తిష్ట వేసిన సమస్యలు దూరమయ్యే అవకాశం లేదు. అదేవిధంగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండడం విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. కేవలం 18 మంది పర్మినెంట్ సిబ్బంది ఉన్నారు. 340 మంది పూర్తిస్థాయి ఉద్యోగులు అవసరం. కానీ ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి అక్కడున్న వివిధ కాంట్రాక్టర్లే గడువు ముగిసినా కొనసాగుతున్నారు. విద్యార్థులకు భోజనం అందించే సంస్థలపై అనేక ఫిర్యాదు ఉన్నప్పటికీ విద్యార్థులు ఆందోళన చేపట్టినప్పటికీ మార్చడం లేదు. ముగ్గురు వైస్ చాన్సలర్‌లు మారినా మెస్ కాంట్రాక్టర్‌లను మాత్రం మార్చడం లేదు. టెండర్లు వేయకుండా వాళ్లకే రెన్యూవల్ చేస్తున్నారు. ఫలి తంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందని పరిస్థితి నెలకొంది. ట్రిపుల్ ఐటీలో అస్తవ్యస్త పరిస్థితుల వల్ల గత రెండేళ్ల నుంచి 10 మంది వరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మకమైన ఈ విద్యాసంస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



మెస్‌లలో భోజనం చేస్తున్న విద్యార్థులు



ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశద్వారం

వీటిపైన దృష్టి సారించండి

- బాసరకు నేషనల్ హైవే కనెక్టివిటితో పాటు రైల్వే లైన్ ఉంది. గోదావరి నదీ తీరాన గల ఈ ఆలయానికి నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. గోదావరి తీరంతో పాటు ఎత్తైన కొండలు ఉన్న బాసరలో టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దితే స్థానికులకు ఉపాధి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బాసరలో భక్తులకు ఆహ్లాదం పంచే కనీసం పార్కు వంటిది కూడా లేదు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి చొరవతో బాసరలో అటవీశాఖ, పర్యాటక ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు చేపడితే మంచి పర్యాటక క్షేత్రంగా ఏర్పడుతుంది.
- కొత్త మండలంగా ఏర్పడ్డ బాసర మండల వాసులకు ఇంకా పాత సమస్యలే వెంటాడుతున్నాయి. జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలి.
- ఇక్కడికి వచ్చే యాత్రికులకు మండల వాసులకు వైద్య సేవల కోసం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇది పేరులో ఉన్నట్లుగానే ప్రాథమిక వైద్యానికే పరిమితమవుతుంది. కొంచెం జ్వరమెక్కువైనా భైంసా లేదంటే నిజామాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. చిన్న చిన్న శస్త్ర చికిత్సలకు సైతం ఇక్కడ సేవలు అందే పరిస్థితి లేదు. ఈ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రి చేయాల్సిన అవసరం ఉంది.
- బాసరకు కేంద్రీయ విద్యాలయం మంజూరై మూడేళ్లవుతుంది. స్థలం లేక ఏర్పాటు పెండింగ్‌లో ఉంది. మంత్రి ఆదేశిస్తే బాసరలో ఉన్న ప్రభుత్వ స్థలాలు అధికారులు గుర్తించే అవకాశం ఉంది. గతంలో రాజకీయ కారణాల వల్ల కేంద్రీయ విద్యాలయంకు ఆటంకాలు ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రద్ధ వహిస్తే మంజూరైన ప్రతిష్ఠాత్మకమైన విద్యాలయం బాసరలో ఏర్పాటు కానుంది.
- బాసర మండలంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. టాక్లి, దోడాపూర్, లాబ్ది, కిర్గుల్ (కె) వంటి గ్రామాల ప్రజలు ఇప్పటికి బస్సు సౌకర్యం ఎరుగరు. జిల్లా ఇన్‌చార్జీ చొరవ తీసుకొని బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
- బాసర మండలంలో ఈ సారి వరదల వల్ల అనేక గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. రోడ్ల నిర్మాణాల కోసం అవసరమైన నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలి
- బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో గత 22 ఏళ్ల నుంచి 80 మంది ఎన్‌ఎంఆర్‌లుగా పనిచేస్తున్నారు. ఎన్నటికైనా దేవస్థానంలో ఉద్యోగ భద్రత దొరుకుతుందనే ఆశతో చాలీ చాలని వేతనంతో పనిచేస్తూ వస్తున్నారు. అనేక సార్లు వారు అనేక మంది నాయకులకు విన్నవించుకున్నారు. వారిని దేవస్థానంలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనం కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- బాసర అమ్మవారి ఆలయంలో కొందరు ఉద్యోగులపై అవినీతి ఆరోపణలున్నాయి. గ్రామస్థులు విజిలెన్స్ అధికారులకు, మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఎన్నో అక్రమాలు వెలుగుచూసినా విచారణల్లో వారి పాత్ర ఉందని తేలినా దేవాదాయ శాఖలో వారి పలుకుబడితో ఎలాంటి చర్యలకు లోనుకాకుండా కొనసాగుతున్నారు. అమ్మవారి నిధులను కాజేస్తున్నా కొందరు సిబ్బందిపై దృష్టి పెట్టాలి.



ట్రిపుల్ ఐటీ హాస్టల్లో పరిస్థితి (ఫైల్)

నేడు బాసరలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పర్యటన

జిల్లా ఇన్‌చార్జీ మంత్రి హోదాలో సీతక్క (ధనసరి అనసూయ) శుక్రవారం బాసరలో పర్యటించనున్నారు. ముందుగా బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని తొలిసారిగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నారు. ముథోల్ నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి చర్చించనున్నారు. తొలసారిగా వస్తున్న మంత్రికి ఘన స్వాగతం పలికేందుకు ఆ పార్టీ శ్రేణులు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదు?

- నలుగురు కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు
- రైతు కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యం

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై వివరణ ఇవ్వాలని నాలుగు జిల్లాల కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ విషయంలో ఎందుకు కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించింది. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గతేడాది విచారణ జరిగింది. ఇది పరిశీలనలో ఉందని, నాలుగునెలల్లో చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఏడాది దాటినా పరిహారం చెల్లించకపోవడంపై కొండల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఎందుకు స్వీకరించరాదో వివరణ ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

సీఎం కప్ క్రీడల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

లక్ష్మణచాంద, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో పలు గ్రామ పంచాయతీలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. వాలీబాల్ క్రీడలో బాలుర విభాగంలో పారెపెల్లి ప్రథమ, లక్ష్మణచాంద ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో చామన్‌పెల్లి ప్రథమ, లక్ష్మణచాంద ద్వితీయ బహుమతి, ఖోఖో క్రీడలో బాలుర విభాగంలో చామన్‌పెల్లి ప్రథమ, పీచర ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో చామన్‌పెల్లి ప్రథమ, లక్ష్మణచాంద, ద్వితీయ, కబడ్డీ క్రీడలో బాలుర విభాగంలో లక్ష్మణచాంద ప్రథమ, వడ్యాల్ ద్వితీయ, బాలికల విభాగంలో రాచాపూర్ ప్రథమ, పీచర ద్వితీయ బహుమతులను అందుకున్నట్లు మెంబర్ కన్వీనర్ ఎంపీడీవో రాధా రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్, ఎస్సై సుమలత, విద్యాధికారి అశోక్ వర్మ, ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, సాయికృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు రమణారావు, శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, డేవిడ్, విలాస్, శ్రీకాంత్, మల్లేష్‌లు ఉన్నారు.

దస్తురాబాద్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు స్థానిక ఎంపీడీవో కే. రమేష్ పతకాలతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్వరాజ్ నవాజ్, ఎంపీవో రమేష్‌రెడ్డి, ఎంఈవో గంగాధర్, ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయులు కోట వేణు, పీఏసీఎస్ డైరెక్టర్ మంచు వెంకన్న, మండల ఇన్‌చార్జి పీడీ నవీన్, రమేష్ రావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవ్వాలి

భైంసా, డిసెంబరు 12 : రానున్న రోజుల్లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించేందుకు గులాబీ శ్రేణులన్నింటినీ సమాయత్త పరచాలని ముథోల్ బీఆర్ఎస్ ప్రతినిధులకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. గురువారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధులు డా.కిరణ్ కోమ్రేవార్, లోలం శ్యాంసుందర్‌ల నేతృత్వంలో పలువురు పార్టీ ప్రతినిధులు హైదరాబాద్‌లో కేటీఆర్‌తో బేటి అయ్యారు.

ఖానాపూర్ : ఖానాపూర్ నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా అసెంబ్లీ వేదికగా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ ఆర్‌ను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యాజాన్సన్ నాయక్ కోరారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హిమబిందు

సిరికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు సూచించారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని కస్తూ రిబా గాంధీ బాలికల విద్యాలయంతోపాటు రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పాఠశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గురువారం మాదకద్రవ్యాల రహిత దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, ఎమ్ ఎల్‌ఎచ్‌పి మహేష్, ఎంపీఎచ్‌ఎ యస్ గంగారాం, ఏఎన్‌ఎంలు స్వప్న, జారుబాయి పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక కార్మికుడి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వాగ్మారే క్రాంతికుమార్ (36) కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. మృతుడి భార్య వాగ్మారే కాంతాబాయి తెలిపిన ప్రకారం.. పంచాయతీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయారని అన్నారు. గురువారం ఉదయం 3 గంటల సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఇంట్లో ఉరి వేసుకున్నారని ఫిర్యాదు చేశారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయండి

- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్

నేరడిగొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. బోథ్ నియోజక వర్గ పరిధిలో గల ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం, నేరడి గొండ మండలంలో లకంపూర్ ఆశ్రమ పాఠశాల సందర్శన, బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయరహదారికి అనుకొని ఉన్న కుంటాల సోమన్న హరితవనాన్ని ప్రారంభిస్తారన్నారు.

ఇచ్చోడ: ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రి సీతక్క హాజరవుతున్నట్లు మండలనాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

బోథ్ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి బోథ్ మండలంలో పర్యటించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. స్థానికంగా ఉన్న పరిచయ గార్డెన్‌లో జరిగే ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో చెక్కుల పంపిణీ చేస్తారన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. బోథ్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న అర్బన్ పార్కును ప్రారంభించనున్నారు.

మాదిగలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు 12: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రిసతీష్ మాదిగా అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు మాసాల పాటు ఉద్యమం కోసమే పట్టుబడి పని చేయాలన్నారు. ఎలాంటి పిలుపు వచ్చిన అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కావాలని 58 కులాలు కోరుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్‌మాదిగ, ఉపాధ్యక్షుడు గైక్వాడ్ సూర్యకాంత్, టౌన్ ఇన్‌చార్జీ మనోజ్, సీనియర్ నాయకులు ఆరేపల్లి గణేష్ పాల్గొన్నారు.



పిప్పల్‌కోటి పాఠశాలలో చలి కారణంగా ఎండలో కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయులు



ఉదయం చలిమంటలు కాచుకుంటూ..




ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో దట్టమైన పొగమంచు

ఆదిలాబాద్‌పై చలిపంజా!

- కనిష్ఠంగా 7.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) /భీంపూర్: ఆదిలాబాద్ జిల్లాపై చలిపంజా విసురుతోంది. గత నాలుగైదు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత కనిపిస్తోంది. గురువారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 7.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే కనిష్ఠంగా బేల మండలంలో 7.0 డిగ్రీలు, భీంపూర్ మండలం అర్లి(టి)లో 7.2, మావలలో 7.4, నేరడిగొండలో 7.5, బోథ్‌లో 7.6, ఆదిలాబాద్‌రూరల్‌లో 8.2, బజార్‌హత్నూర్‌లో 8.9, తలమడుగులో 9.1, తాంసిలో 10.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండానే చలి తీవ్రత కనిపిస్తుంది. పగటి పూటనే వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నా యి. ముఖ్యంగా మారుమూల ఏజెన్సీ గ్రామాలను పొగమంచు కప్పేయడంతో తీవ్రమైన చలి కనిపిస్తుంది. ఉదయం రాత్రి వేళలో చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.

భోసిలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

తానూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోసి గ్రామంలో గల శ్రీసరస్వతీ శిశుమందిర్ విద్యాలయ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం శ్రీరామశరణ్ శర్మవేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజనిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అరటిదిమ్మెలతో వినాయక, సుబ్రమణ్య, అయ్యప్పస్వాములకు సన్ని ధానం ఏర్పాటుచేసి పూలతో అలంకరించారు. ముందుగా విఘ్నేశ్వరస్వామికి, అనంతరం సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజచేశారు. శ్రీరామశరణ్ శర్మ వేదపండితులు అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామశరణ్‌శర్మ వేద పండితులు మాట్లాడుతూ ప్రతీఒక్కరు భగవంతుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. భోసిలోని కర్ర వరసిద్ధి వినాయకుని 1963లో ప్రతిష్ఠించి ఇప్పటివరకు గ్రామంలో ఒకే కర్ర వినాయకున్ని పూజించడం అరుదని అన్నారు. ఈ గ్రామస్థులు పర్యావరణ పరిరక్షకులుగా నిలుస్తున్నారని అభినందించారు. అయ్యప్ప స్వాములు దీక్షతో పాటు కాకుండా ఇతర సమయంలోనూ కూడా సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ దేశ రక్షకులుగా, ధర్మ రక్షకులుగా నిలవాలని సూచించా రు. భారతదేశంలో పుట్టడం, హిందువుగా జీవించడం అదృష్టమని అన్నారు. అనంతరం అయ్యప్ప స్వామివారి 18మెట్లకు ప్రత్యేకమైన పూజలు చేసి, 18వ సంవత్సరం మాలధారణ చేసిన నారికేళ నాగనాథ్ గురుస్వామిచే, కన్య అయ్యప్ప స్వాములతో పడి కార్పురాన్ని వెలిగించారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాదేవుని ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామిదీక్ష పరులకు, భక్తులకు మహా అన్నప్రసాదం చేశారు. కార్యక్రమంలో శివకుమార్ గురుస్వామి, రమణప్రసాద్ గురుస్వామి, గోపాల్ గురుస్వామి, పోతన్న గురుస్వామి, శ్రీకాంత్ భజన బృంధం పెద్దఎత్తున హాజరయ్యారు.

భీంపూర్ : మండలంలోని పిప్పల్ కోటిలో గురువారం అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు కొండ అనిల్ యాదవ్, శ్రీ రామోజీ వార్ కిష్టన్న, లచ్చన్న, ముకుందా సంతోష్, కుంట మానేష్ రెడ్డి, కొండ్ర శ్రీకాంత్, విలాస్, రాజు, సుధాకర్, ప్రజ్వాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన ఇద్దరిపై కేసు

బోథ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండలంలోని సంపత్ నాయక్ తండా, గన్‌పూర్, టీపీటీ గ్రామాలకు చెందిన ఐదు గురు వ్యక్తుల నుంచి రూ.5 లక్షల 50 వేలు వసూలు చేసి మోసగించిన ఇరువురు కరీంనగర్‌కు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఇందుకు సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని సంపత్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ సంజీవ్ ఈ విషయమై గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన సతీష్, రేష్మ అనే ఇరువురు వ్యక్తులు సంపత్ తండాకు చెందిన రాథోడ్ వినోద్ ద్వారా ఫోన్‌లో పరిచయం అయ్యారు. అయితే వారు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి సంపత్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ సంజీవ్ వద్ద లక్షా 50 వేలు తీసుకొని నామమాత్రపు ఎలక్షన్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పించారు. కొన్నాళ్లకు ఉద్యోగం పోయిందన్నారు. అదే గ్రామానికి చెందిన రాథోడ్ బాపూరావు వద్ద లక్షా ఇరవై వేలు తీసుకొని కార్గో కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘనూపూర్‌కి చెందిన చౌహాన్ మచ్చేందర్ వద్ద టీపీటీ గ్రామానికి చెందిన ఆత్రం బాలు, ఆత్రం జంగు, సంపత్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ దినేష్‌ల వద్ద నుంచి మొత్తం ఐదు లక్షల 50 వేలు తీసుకున్నట్లు ఆరోపించారు. ఏడాది కాలం నుంచి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండలో మాజీ ఎంపీ పర్యటన



మాజీ ఎంపీని సత్కరిస్తున్న నాయకులు

సిరికొండ, డిసెంబరు 12(ఆం ధ్రజ్యోతి) : సిరికొండ మండలంలో గురువారం మాజీ ఎంపీ సోయంబాపురావ్ పర్యటించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు ఎండీ రం జాన్ మాజీ ఎంపీ సోయంబాపురావ్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

సిరికొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయిం చిన ఖాళీ స్థలాన్ని గురువారం ఎస్సై శివరాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాళీ స్థలాన్ని జేసీబీతో చదును చేసి, హద్దురాళ్లని ఏర్పాటుచేశారు. చెత్తాచెదారాన్ని తొలిగించి, మట్టి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఆయన వెంట కానిస్టేబుల్ విలాస్ ఉన్నారు.

దివంగత కేంద్ర మంత్రి గోపినాథ్ ముండే జయంతి

ఇంద్రవెల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్ర మంత్రి గోపినాథ్ ముండే జయంతిని పురస్కరించుకుని గురు వారం మండల కేంద్రంలో మండల వంజరి కులస్థుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చెర్మన్ డోంగ్రే మారుతి పటేల్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గిత్తే మారుతి మహరాజ్, ఫడ్ వరుణ్ పటేల్, ముస్లే కేశవ్, ముండే సాయినాథ్, చోలే చంద్రకాంత్, ఫడ్ వికాస్, తదితరులు పాల్గొన్నారు.

'నిర్మాణ పనులపై విచారణ జరిపించాలి'

బోథ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పను లు నాసిరకమైన ఇసుకతో పనులు చేస్తున్నారని బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ ఆరోపించారు. నాసిరకమైన ఇసుకతో పనులు చేపట్టడం వల్ల తాను గురువారం పనులను అడ్డుకున్నానన్నారు. దీంతో నాసిరకమైన ఇసుకకు బదు లుగా ఎర్ర ఇసుకను తెప్పించి పనులు చేపట్టారన్నారు. అధికారులు నాసిరకమైన పనులపై విచారణ జరిపించి పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన ప్లేట్ల విరాళం

బోథ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా(బీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డ పున్నారి నాగభూషణ్ రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆయన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం మధ్యాహ్నా భోజనం ప్లేట్లను విద్యార్థులకు విరాళంగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగి చదివిన పాఠశాలలో విద్యార్థుల కు చేతనైనంత సేవ చేస్తున్నాని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కె.పోశెట్టి ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

14న డైట్ చార్జీల పెంపు కార్యక్రమం : జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి):ఈ నెల 14న జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మోడల్స్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో డైట్‌చార్జీలు పెంపు లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గూగుల్‌మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారన్నారు.

ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల స్థితిగతుల పరిశీలనకు
టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు

● ఆదిలాబాద్ కలెక్టర్ ఆదేశాలతో అధికారుల తనిఖీలు


స్నానపు గదులు, మరుగుదొడ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

ఉట్నూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యం, భోజనం, వసతి సౌకర్యాల పరిశీలనకు కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశారు. ఉమ్మడి జిల్లాలోని వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో గత నెలలో చోటు చేసుకున్న పరిణామాలను పరిగణలోకి తీసుకుని రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యామలదేవిల ఆధ్వర్యంలో ప్రకటించి ఈ బృందాలలో జిల్లా అధికారులను సభ్యులుగా నియమించారు. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన టాస్క్‌ఫోర్స్ బందంలోని ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ పాఠశాలల తనిఖీలు ప్రారంభించారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో 60 మంది బాలికలు అస్వస్థత గురికాగా వెంటనే సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించినప్పటికి గిరిజన బాలిక శైల వైద్యం అందుకుంటు మృతి చెందడంతో ఐటీడీఏ ద్వారా 2 8లక్షలు ఖర్చుపెట్టిన బాలికను బతికించుకోలేక పోయామని జిల్లా అధికారయంత్రాంగం విచారం వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలో ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతంకావద్దని భావించిన కలెక్టర్ ఆదేశాలతో ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్ ప్రతిరోజు పాఠశాలల్లో సందర్శిస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల పరిసరాలతో పాటు వంటగదులను, స్నానాల గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లించి ప్రతిరోజు పరిసరాల పరిశుభ్రత చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని, ఆహారం నాణ్యతలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బృందాలలో ఉన్నజిల్లా ఔషధ అధికారి, పౌరసరఫరాల అధికారి, ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి, జిల్లా మహిళా అభివృద్ధి అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఫుడ్‌సెక్యూరిటీ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఆయాగురుకులాలల ఆర్‌సీఓలు, బీసీ డబ్ల్యులు సైతం సందర్శించి కలెక్టర్ ఆదేశాలు పాటించేలా చూడాల్సిన పరిశీలకులు అంటున్నారు.

ప్రభుత్వ కళాశాలలో వంద ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు

● కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్

తలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు పరీక్షలు ముగిసి వరకు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. అంతేకాకుండా కళాశాల నుంచి విద్యార్థులు ఇంటికి రాగానే విద్యార్థుల తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగాల్లో మసకబారుతున్న ప్రమాణాలు

● రసాయనాలు లేని ప్రయోగాలు ● సమీపిస్తున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు ● ప్రయోగాలపై విద్యార్థులకు అంతంత మాత్రంగానే అవగాహన



భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల



నిరుపయోగంగా ఉన్న ప్రయోగాల రసాయన పదార్థాలు


వసతుల లేమితో ఇబ్బందులు పడుతూ ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

భైంసా, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి. అధ్యాపక సిబ్బంది ప్రదర్శిస్తున్న అలసత్వ విధానాలు, కళాశాలల్లో సరైన రీతిలో లేని ల్యాబ్‌లు వెరసి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రయోగ నిర్వహణ ప్రమాణాలు మసకబారిపోతున్నాయి. రెగ్యులర్‌గా చేయాల్సిన ప్రయోగాలు కళాశాలల్లో అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నట్లుగా తెలుస్తోంది నామమాత్రంగా జరుగుతున్న ప్రయోగాల మూలంగా విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానంపై అంతంత మాత్రంగానే అవగాహన కలుగుతోంది. ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి మాసంలో ప్రయోగ, మార్చిలో థియరీ పరీక్షలు జరుగనున్నాయి. ఈసారి ప్రయోగ పరీక్షల నిర్వహణను రాష్ట్ర సర్కార్ పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేబడుతున్న నేపథ్యంలో ప్రయోగాల నిర్వహణపై అంతంత మాత్రంగానే అవగాహన కలిగిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రసాయన శాస్త్ర ల్యాబ్

24 కళాశాలల్లో ప్రయోగ పరీక్ష కేంద్రాలు

జిల్లాలో ప్రభుత్వజూనియర్ కళాశాలలు 13, కేజీబీవీ 10, సాంఘీక, ట్రైబల్, మైనార్టీ, ఎస్సీ సంక్షేమ కళాశాలలు 10, ఆదర్శ కళాశాల 1, ప్రైవేట్ కళాశాలలు 20 వరకు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో నుంచి 11 ప్రభుత్వకళాశాలలు, 3 సాంఘీక సంక్షేమశాఖ కళాశాలలు, ఆదర్శకళాశాల, 9 ప్రైవేట్ కళాశాలలను కలుపుకొని మొత్తం 24 కళాశాలల్లో ప్రయోగ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అన్ని కళాశాలలను కలుపుకొని మొదటి సంవత్సరములో దాదాపుగా 9వేల మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరములో 8వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు.

నిర్వహణ అంతంతే!

ఇంటర్ ద్వితీయసంవత్సరం విద్యార్థులలో ఎంపీసీ విద్యార్థులు భౌతిక, రసాయన, బైపీసీ విద్యార్థులు భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రాల ప్రయోగాలను పూర్తిచేసుకుని పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రతీ ఇంటర్ విద్యార్థి రెండు సంవత్సరాలలో ఏడాదికి 20చొప్పున రెండేళ్లలో ప్రతీ పాఠ్యాంశంలోనూ 40ప్రయోగాలు నేర్చుకోవాలి. అయితే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహణ అంతంత మాత్రంగానే నేర్పుతున్నట్లు తెలిసింది. అధికశాతం కళాశాలలు మొదటిసంవత్సరంలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించడం లేదనే సమాచారం. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రం కొన్నిప్రాక్టికల్స్ నేర్పుతున్నారు. కళాశాలల్లో ల్యాబ్‌లకు సరిపోయే రీతిలో గదులు లేకపోవడం, ఉన్న వాటిల్లో నిర్వహణకు సంబంధించి పరకరాలు, రసాయన పదార్థాలు తదితర వాటి సరఫరా లేకపోవడం మూలంగా ప్రాక్టికల్స్ పూర్తి స్థాయిలో నిర్వహించడం లేదని తెలిసింది.

అధ్వానంగా ప్రయోగశాలలు

ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులకు రసాయన, భౌతిక శాస్త్రం ప్రాక్టికల్ పరీక్షలు, బైపీసీ విద్యార్థులకు రసాయ, భౌతిక శాస్త్రం పరీక్షలతోపాటు జీవ, వృక్షశాస్త్ర ప్రాక్టకల్ పరీక్షలు తప్పనిసరి. ఈ ప్రయోగాల్లో రసాయన శాస్త్ర ప్రాక్టికల్ పరీక్షల్లో వినియోగించే బ్యూరెట్, పీపెట్ పరీక్ష నాళికలను కనీసం రెండు, మూడేళ్లకు ఒకసారైనా మార్చాల్సిందే. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆరు, ఏడు సంవత్సరాల క్రితం సరఫరా అయిన పరికరాలనే నేటికీ వినియోగిస్తున్నారు. నిధులు లేకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుబాటు చేసుకుంటున్నారు. యాసిడ్స్‌తోపాటు సాల్ట్, ఇతర రసాయనాలను ఆచీతూచి వినియోగించాల్సి వస్తోంది. ఇక ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు అధ్వానంగా ఉన్నాయి. పేరుకే అవి ప్రయోగశాలలు అని చెప్పుకోవడానికి మాత్రమే పరిమితవుతున్నాయి. వాటిల్లో ప్రయోగాల నిర్వహణకు సంబంధించి ఎలాంటి వసతులు, సౌకర్యాల కల్పన జరుగలేదు. ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించి పరికరాలు, సామగ్రి సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక అన్ని వసతులు ఉన్న కళాశాలల్లో మాత్రం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ కొద్ది మేర నేర్పినట్లుగా సమాచారం. పలు ప్రభుత్వ కళాశాలల్లో ల్యాబ్‌ల నిర్వాహణకు గదులు లేకపోవడం మూలంగా తరగతి గదులనే ప్రయోగశాలలుగా మార్చి ప్రయోగాలు చేయించారని సమాచారం. మరికొన్ని కళాశాలల్లో ఒకే తరగతి గదిలో నాలుగు పాఠ్యాంశాలను విడతల వారీగా ప్రయోగాలు చేయించి చేతులు దులుపుకున్నారని ఆరోపణలున్నాయి.

విద్యార్థులకు అవగాహన కరువు

ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు ప్రయోగాలు అంతంత మాత్రంగానే నేర్పుతున్నారని తెలిసింది. కొన్ని ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు, రసాయన పధార్థాల గూర్చి నామ మాత్రం గానైనా అవగాహన కల్పించట్లేదనే ఆరోపణలున్నాయి. అధిక శాతం ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇప్పటికి ప్రత్యేకంగా ల్యాబ్ గదులు లేవంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతుంది. కళాశాలల మంజూరు కోసం కావాల్సిన నిబంధనల్లో భాగంగా ఏర్పాటుచేసిన ల్యాబ్ తదనంతరం తీసివేస్తున్నట్లుగా సమాచారం. అధికారులు పర్యవేక్షణకు వచ్చే సందర్భంలో తాత్కాలికంగా ఏదో ఒక కళాశాల నుండి సామాగ్రిని తరలించి తనిఖీలో చూపడం. ఆ తర్వాత తూతూమంత్రంగానే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వాహణ నామమాత్రంగానే జరుగుతుండటంతో విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానంపై అవగాహన పెరుగడం లేదు. కేవలం ప్రాక్టికల్స్ పరీక్షలు సమీపిస్తున్న సమయంలోనే మొక్కుబడిగా చర్యలు చేపట్టి తదనంతరం విస్మరిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం పేరిట జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన జరిగిన అనంతరం ప్రభుత్వ కళాశాలలను అజమాయిషీ చేసే కార్యాలయానికి పూర్తిస్థాయిలో అధికారులను, సిబ్బందిని కేటాయించకపోవడంతో కళాశాలలపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది.. ఫలితంగా ప్రయోగాల్లో ప్రమాణాలు మసకబారిపోతున్నాయి. ఇంటర్ బోర్డు ఉన్న అధికార యంత్రాంగం ఇకనైనా వెంటనే స్పందించి ప్రయోగాల నిర్వహణ వ్యవస్థ మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేటి నుంచి సాయిలింగిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


యజ్ఞం నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన యజ్ఞశాల

తలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిలింగి గ్రామంలో గల శిరిడి సాయిబాబా 24వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, రిటైర్డ్ బీఎస్‌ఎన్‌ఎల్ డీఈ దెబ్బడి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిలింగి గ్రామంలో గత 24 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు, పూర్ణాహుతి, సాయిబాబా పల్లకి, ఊరేగింపు, అన్నదానం, వేద పండితుల ప్రవచనాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాయి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి దాదాపు 70 మంది అనాథలకు ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వృద్ధాశ్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షులు దేబ్బడ అశోక్ తెలిపారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలి

నేరడిగొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని జిల్లా ఎస్‌బీఎం ఇన్‌చార్జి జాదవ్ చంపత్‌రావ్ అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో స్వచ్ఛత సేవా ఆక్టివిటీస్‌లో భాగంగా విద్యార్థినులకు ఎస్‌ఏ రైటింగ్ నిర్వహించారు. అందులో భాగంగా ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థినులకు స్టీల్ బాటిల్‌తో పాటు సర్టిఫికెట్ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థినిలకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ సంతోష్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, వార్డెన్‌స్వప్న, ఏ ఎన్‌ఎంలు సంగీత తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం, దేశీదారు అక్రమ రవాణా తదితర కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం అబ్కారీశాఖ కార్యాలయంలో వేలం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న బిడ్డర్లను పిలిచి వారి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 14వాహనాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా ఇందులో 13వాహనాలు, ఒక ఇండికా కారు ఉంది. కొన్నింటిని తుక్కుకింద విక్రయించగా వినియోగించేందుకు వీలుగా ఉన్నవాటిని పలువురు బిడ్డర్లు వేలం పాటలో దక్కించుకున్నారు. అక్రమ మద్యం, దేశీదారు సరఫరా చేస్తూ రెండేళ్ల వ్యవధిలో పట్టుబడ్డ 13 ద్విచక్రవాహనాలు, ఒక కారు వేలం పాటను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ తెలిపారు.

టీఎస్‌యూటీఎస్ జిల్లా మహాసభల పోస్టర్ల విడుదల

ఇచ్చోడ, డిసెంబరు, 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం జరుగనున్న టీఎస్‌యూటీఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎస్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ పేర్కొన్నారు. గురువారం ఇచ్చోడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.



బోథ్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపి ఉంచి పట్టుకున్న ఇసుక లారీ

బోథ్‌లో ఇసుక లారీ పట్టివేత

బోథ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి తప్పుడు వేబిల్లులతో వచ్చిన ఇసుక లారీని గురువారం ఎస్సై ప్రవీణ్ పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తప్పుడు ధృవీకరణ పత్రాలతో మండల కేంద్రానికి ఇసుక లారీ వచ్చింది అన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి లారీ వద్దకు చేరుకున్నారు. వే బిల్లులతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు సరైనవి లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. కాగా జీరో బిల్లులతో వస్తున్న ఇసుక లారీలు స్థానికంగా ఉన్న వ్యాపారులకు తక్కువ ధరల్లో విక్రయించి వెళుతుండడంతో స్థానికులు పట్టుకొని గతంలో ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా వ్యాపారుల తీరు మారడం లేదు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు

ఉట్నూర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో గురువారం ఉత్సాహంగా సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభ మయ్యాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సీఎం కప్‌పోటీలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు పురస్కారాలు అందిస్తున్నందున పోటీలు మరింత పోటాపోటీగా జరుగుతాయని అన్నారు. ఈ నెల 16నుంచి జరిగే జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కబడ్డీ కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంప్రసాద్, ఎంఈఓ ఆశణ్ణ, మండల కన్వీనర్ జాదవ్ హేమంత్‌నాయక్, జాడి రమేష్, కృష్ణ, జలపతి, సురేష్, సంగీత, రవీందర్, శివకృష్ణ, సునంద్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా పార్థసారథి

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9 • కనిష్ఠం 14.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 13 డిసెంబరు 2024



మత్స్యకారుల ఉపాధికి గండి



చనిపోయిన చేప పిల్లలను చూపుతున్న మత్స్యకారులు

- జిల్లాలో చేపల పెంపకంపై నీలినీడలు
- 555 చెరువుల్లో మాత్రమే చేపపిల్లల విడుదల
- ఇంకా ఇప్పటి వరకు 93 చెరువులకు చేరని విత్తనం
- స్పందించని జిల్లా యంత్రాంగం
- ఈ ఏడాది భారీగా నష్టపోతున్న జాలర్లు
- ఎండిపోయిన చెరువుల సంగతి అంతే..
- భారీగా తగ్గపోతున్న ఉత్పత్తి

నిర్మల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, రిజర్వాయర్‌లలో చేపపిల్లల పెంపకంపై మత్స్యశాఖ నిర్వాహకం కారణంగా వేలాది మంది చేపలవేటపై ఆధారపడ్డ మత్స్యకారుల ఉపాధికి గండి పడుతోంది. ప్రతీఏటా వర్షకాలం మొదలుకాగానే రిజర్వాయర్‌లు, చెరువుల్లోకి వరద నీరు చేరుకుంటున్న సమయంలో చేపపిల్లలను వదలడం అనవాయితీగా వస్తోంది. మత్స్యకారులను ఆదుకునేందు కోసం ప్రభుత్వం కొంతకాలం నుంచి ఉచితంగానే వారికి చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. అయితే గత సంవత్సరం చేపపిల్లల పంపిణీ, విడుదల విషయంలో అనేక ఆరోపణలు రావడంతో ఈ సారి ఈ వ్యవహారం మొదటి నుంచి గందరగోళానికి కారణమైంది. అయితే పెంపకం కోసం అవసరమైన చేపపిల్లల మొత్తం నుంచి ఈ సారి కేవలం 50 శాతం మాత్రమే జిల్లాకు పంపిణీ చేయడంపై కూడా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పాటు చేప పిల్లల కొనుగోలు, పంపిణీకి సంబంధించిన టెండర్‌ల ప్రక్రియ కూడా ఆలస్యమైంది. చేపపిల్లలను పంపిణీ చేసే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా ఏర్పడి ధర విషయంలోనూ, నాణ్యత విషయంలోనూ మొండివైఖరి అవలంభించడంతో ప్రక్రియ మరింత ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఈ సారి చేపపిల్లల పెంపకం వ్యవహారం ఇటు స్థానిక జిల్లా అధికారులను అటు మత్స్యకారులను అయోమయానికి గురిచేసింది. జిల్లాలో మొత్తం 648 చెరువులు ఉండగా 4.74 కోట్ల చేపపిల్లలను వదలాలని ఈ సారి లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే బిడ్డర్‌లకు అప్పటి ప్రభుత్వం గత బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా ఈ సారి బిడ్‌లలో పాల్గొనలేదు. దీని కారణంగా పలుసార్లు టెండర్‌ల ప్రక్రియను నిర్వహించాల్సి వచ్చింది. వర్షాలు కురియడం నిలిచిపోయినప్పటికీ టెండర్ ప్రక్రియ మొదలుకాలేదు. దీంతో చేపపిల్లల వ్యవహారం సందిగ్ధతకు కారణమైంది. ఈ క్రమంలోనే కొన్ని చెరువులు సైతం పూర్తిగా ఎండిపోయాయి. ప్రభుత్వం 50 శాతం మాత్రమే చేపపిల్లలను వదలాలని నిర్ణయించడంతో జిల్లాలో 2.37 కోట్ల చేపపిల్లలను వదలాలని నిర్ణయించారు. అయితే గత నవంబర్ 25వ తేదీ వరకు మొత్తం చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు గడువుగా నిర్ధారించారు. ఈ గడువును కేవలం 555 చెరువుల్లో మాత్రమే చేపపిల్లలను వదిలారు. ఇంకా 93 చెరువుల్లో చేపపిల్లలను వదలాల్సి ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

13వేల మంది మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం

ప్రభుత్వం ఈ సారి చేపపిల్లల పెంపకం విషయంలో అస్తవ్యస్థ విధానాలు అమలు చేసిన కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో చేప పిల్లల పెంపకంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఆలస్యంగా చేప పిల్లలను వదిలిన కారణంగా చెరువుల్లోనూ, రిజర్వాయర్‌లలోనూ చేపలు పెరిగేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు. ఈ క్రమంలోనే చెరువులు, రిజర్వాయర్‌లలో నీటినిల్వలు తగ్గిపోయే అవకాశం ఉంటుందని రాబోయే మార్చి వరకే ఎక్కువ చెరువులు ఎండిపోయే అవకాశం ఉన్న కారణంగా చేపపిల్లల పెంపకంపై ప్రభావం పడుతుందని అంటున్నారు. ఇదే జరిగితే జిల్లాలోని 22 మత్స్యకార సొసైటీల పరిధిలో ఉన్న 13వేల మంది మత్స్యకారుల ఉపాధికి గండిపడే అవకాశం ఉందంటున్నారు.

సైజు విషయంలో గందరగోళం

కాగా టెండర్‌ను దక్కించుకున్న బిడ్డర్స్ 80 నుంచి 100 మిల్లీమీటర్ల సైజు గల లక్ష చేప పిల్లలకు 1.73లక్షల రూపాయిలు చెల్లించనుంది. అలాగే 35 నుంచి 45 మిల్లీ మీటర్ల సైజు గల లక్ష చేప పిల్లలకు ప్రభుత్వం 64వేల రూపాయలను చెల్లించనుంది. అయితే గత సంవత్సరం కొంత మంది బిడ్డర్‌లు పెద్ద సైజు పేరిట చిన్న సైజు చేప పిల్లలను వదిలినట్లు ఆరోపణలున్నాయి. శాశ్వత నీటి వనరులు లభించే చెరువుల్లో 40 శాతం బొచ్చ, 50శాతం రహు, 10శాతం మెరిగల రకం చేప పిల్లలను వదులుతారు. సీజన్ చెరువులు అంటే ఆరు నెలల నుంచి తొమ్మిది నెలల పాటు నీరు ఉండే చెరువులను పేర్కొంటారు. ఈ చెరువుల్లో 35 మిల్లీ మీటర్ల నుంచి 40 మిల్లీ మీటర్ల సైజు గల చేప పిల్లలను మాత్రమే వదులుతారు. దీని కారణంగా ఈ చెరువుల్లో బొచ్చ రకం 35 శాతం, రహురకం 35శాతంతో పాటు బంగారు తీగ 30 శాతం నిష్పత్తిలో చేపపిల్లలను వదులుతారు. అయితే చేప పిల్లలను వదలడం ఆలస్యం కావడంతో వీటి పెంపకం వ్యవహారం అయోమయానికి కారణమవుతోంది.

ఈ సారి 50శాతమే ఉత్పత్తి

కాగా చేపపిల్లల పెంపకం ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు బిడ్డర్‌లు టెండర్‌లు దాఖలు చేసేందుకు అనేక తిరకాసులు పెట్టడంతో ప్రభుత్వం ఈ సారి 50శాతం చేపపిల్లల పెంపకానికే మొగ్గు చూపింది. దీనికి అనుగుణంగా జిల్లాలో 4.74 కోట్ల చేపపిల్లలను వదలాలని మొదట నిర్ణయించారు. అయితే 50శాతం నిబంధనలు అమలులోకి రావడంతో 2.37 కోట్ల చేపపిల్లలను మాత్రమే వదలాలని నిర్ణయించారు. మొత్తం ఈ 50శాతం చేపపిల్లలను గత నవంబర్ 25వ తేదీ వరకు జిల్లాలోని 648 చెరువుల్లో వదలాలని నిర్ణయించారు. అయితే అనేక కారణాల వల్ల ఇప్పటి వరకు కేవలం 555 చెరువుల్లో మాత్రమే చేపపిల్లలను వదిలినప్పటికీ మరో 93 చెరువుల్లో ఇంకా చేపపిల్లలను వదలాల్సి ఉంది. కాగా ఇప్పటికే చాలా చెరువుల్లో నీరు కనిష్టస్థాయికి చేరుకుంటున్న కారణంగా ఇక ఆ చెరువుల్లో చేపపిల్లలను వదలడం సాధ్యం కాకపోవచ్చని అంటున్నారు. ఇలాంటి పరిణమాల కారణంగా ఈ సారి చేపపిల్లల పెంపకంపైనే కాకుండా మత్స్యకారుల ఉపాధిపై కూడా ప్రభావం పడవచ్చని అంటున్నారు.

సదర్మాట్ బ్యారేజ్‌పై మొసలి



సదర్మాట్ బ్యారేజీ పైన వెళ్తున్న మొసలి, ఇన్‌సెట్‌లో నీటిలో వెళ్తున్న దృశ్యం

మామడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో గల గోదావరి నదిపై నిర్మిస్తున్న నూతన సదర్మాట్ బ్యారేజీపై గురువారం నీటిలో నుంచి బ్యారేజీ పై రోడ్డులో మొసలిరోడ్డుపై కనిపించడంతో ప్రజలు, మత్స్యకారులు అమ్మ బాబోయ్ మొసలి అంటూ పరుగులు తీశారు. గోదావరిలో కూడా మూడు లేదా నాలుగు మొసళ్లు ఉన్నట్టు మత్స్యకారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతున్న మత్స్యకారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గోదావరిలోకి వెళ్లే ముందు చూసి వెళ్లాలని, అవి వెళ్లిపోయే వరకు గోదావరిలో చేపలు పట్టకూడదని తెలిపారు.

ప్లాస్టిక్ విస్తర్ల వాడకం తగ్గించాలి



విఠలేశ్వర ఆలయానికి ప్లేట్‌లను అందజేస్తున్న మిత్రమండలి

కుబీర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ విస్తార్ల వాడకం తగ్గించాలని మిత్ర మండలి నాయకులు ప్యాట లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు వడ్నం నాగేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయానికి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మిత్రమండలి నాయకులు రూ. 35వేలతో 300 స్టీల్‌ప్లేట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు డా.పెంటాజీస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా మిత్రమండలి నాయకులు సట్ల గంగాధర్, కోలేవార్ పోతన్న మాట్లాడుతూ ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ విస్తార్ల వాడకం తగ్గించాలనే సదుద్దేశ్యంతో 300 స్టీల్‌ప్లేట్‌లను అందించడం జరిగిందన్నారు. మిత్రమండలి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సంపి రాజేశ్వర్, అరవింద్, మారుతి, సూది రాజన్న, నాగలింగం, అనీల్, నింజన్, దత్తాత్రి, వెంకటస్వామి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషా దినోత్సవం



భారతీయ భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నర్సాపూర్(జి), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం భారతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా రాష్ట్రాల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఆయా రాష్ట్రాల భాషలలో మాట్లాడారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

• సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పిలుపు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఎస్పీ జానకిషర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లలో చట్టరీత్యా రాజీకి అర్హతలు గల క్రిమినల్, సివిల్, భూ వివాదాలు, ప్రమాద పరిహార, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ తదితర కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. వైవాహిక కేసులు, తగాదాలు అన్ని రకాల ట్రాఫిక్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని తెలిపారు. కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృధా చేసుకోవద్దనే ఉద్దేశ్యంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. న్యాయశాఖ ఇచ్చిన ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. వివరాలకు సంబంధిత సమీప పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పాఠశాలను సందర్శించిన
పంచాయతీ రాజ్ ఈఈ, డిప్యూటీ ఈఈ

సోన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాలను గురువారం పంచాయతీరాజ్‌శాఖ ఈఈ అశోక్, డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్‌లు సందర్శించారు. పనులు చివరి దశలో ఉన్నందున మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. ఏఈ అంజన్ కుమార్, తదితరులు ఉన్నారు.

నిర్మల్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగుల మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న సమగ్ర శిక్షాఉద్యోగులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన చర్చలు విఫలం కావడంతో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నట్టు నాయకులు భూసారపు గంగాధర్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. పేస్కేల్ అమలు, క్రమబద్ధీకరణ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్‌జోన్ పునరావాస గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్ జోన్ పునరావాస గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కవ్వాల్ ఫారెస్ట్ పునరావాస గ్రామాలు రాంపూర్, మైసంపేట్ ప్రజలకు కల్పిస్తున్న వసతులు, ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కవ్వాల్ టైగర్ జోన్ సంబంధించి పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు కవ్వాల్ అడవులను పరిరక్షించాలని సూచించారు. రహదారులు, నివాసాలకు విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. వ్యవసాయం, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ పాఠశాలలో పిల్లల భవిష్యత్తుకు భరోసాగా మంచి విద్య అందించాలన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు లేదా స్వయం ఉపాధి మార్గాలను ప్రోత్సహించాలన్నారు. ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్‌పక్కాగా అమలు చేయాలని సూచించారు. అటవీ భూముల రక్షణ, పర్యావరణం, ప్రకృతి వనరుల పునరుద్ధరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఎఫ్‌వో నాగిని భాను, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు అశోక్‌కుమార్, శంకరయ్య, డీటీడీవో అంబాజీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ సుదర్శన్, ఖానాపూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, అటవీ శాఖ అధికారులు అరుణ్, రాజేందర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

గ్రూప్- 2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

గ్రూప్- 2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రూప్- 2 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్ పట్టణంలో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 8080 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. డిసెంబరు 15న ఉదయం 10 నుండి 12:30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 వరకు, అలాగే 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ వాచీలు వంటి వస్తువులతో రాకూడదని అన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాలలో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్స్, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పొరపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలపై శిక్షకులు రవికుమార్ పరీక్షల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పరీక్షల కోఆర్డినేటర్ పీజీరెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు, గోవింద్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, అంబాజీ, రమణ, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భరత్ కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ హామీ

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి భరత్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్‌లు హామీ ఇచ్చినట్లు ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 జిల్లా అధ్యక్షులు కృష్ణమోహన్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆర్ఎన్‌టీసీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర బాధ్యులు శ్రావణ్‌కుమార్, మల్లేష్‌లతో కలిసి 3194 నిర్మల్ జిల్లా ప్రతినిధులు కలెక్టర్, డీఎం అండ్ హెచ్‌వోలను కలిశారు. ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తూ ఆత్మహత్య చేసుకున్న భరత్ కుటుంబం తీరని అన్యాయానికి గురవుతున్నదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రెండేళ్ల కుమారుడు, భార్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. తమ సంఘ ప్రతినిధుల మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వెంటనే భరత్ భార్యకు తాత్కాలిక ఉద్యోగం కల్పించాలని కోరగా ఆమె సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, ప్రోగ్రాం అధికారి రవీందర్ రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు భరత్ కుటుంబాన్ని పరామర్శించారు. కలెక్టర్, డీఎం అండ్ హెచ్‌వోలను కలిసిన కార్యక్రమంలో సంఘం నాయకులు బారె రవీందర్, భోజారెడ్డి, రవికిరణ్, లాలయ్య, శేషు, వేణుగోపాల్, కిషన్ ఉన్నారు.

గడువులోగా ఇందిరమ్మ
లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తి చేయాలి

• భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్



సమీక్షా సమావేశం మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్

భైంసా, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలయాపనకు,లోపాలకు తావులేకుండా ప్రభుత్వ విధించిన గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గుర్తింపు సర్వేను పూర్తి చేయాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో సర్వే నిర్వహిస్తున్న వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు రోజులుగా చేపట్టిన సర్వే వివరాలను పరిశీలించారు. వార్డు అధికారులు తమకు కేటాయించిన వార్డులలోని దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి పూర్తి వివరాలను సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా సత్వరమే అధికారులకు నివేదించి వాటిని నివృత్తి చేసుకొని పరిష్కరించుకోవాన్నారు. జాప్యపు విధానాలకు అస్కారం లేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులకు
ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం

లోకేశ్వరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో గురువారం మధ్యాహ్నం జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాంనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గౌతమ్ పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ప్రతీరోజు విద్యార్థులు హాజరయ్యేటట్టు చూడాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇంటర్‌బోర్డుకు కొత్తగా కార్యదర్శి నియమితులయ్యారు. ఆయన సూచన మేరకు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసుకొని పిల్లల మార్గ నిర్దేశకులను, వారి భవిష్యత్‌ను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకులు విఠల్, ప్రమీల రాణి, శ్రీనివాస్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఇసుకను
తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

లక్ష్మణచాంద, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామన్‌పెల్లి గ్రామశివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను (ఏపీ 01 ఏసీ 9417) పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ జానకి గురువారం తెలిపారు. ఈ ట్రాక్టర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం కోసం పై అధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆమె వివరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, మూడోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

16న ఇసుక వేలం

లక్ష్మణచాంద నుంచి కంజర్ వెళ్లే రోడ్డు మార్గంలో వ్యవసాయ తోటలలో డంప్ చేసి ఉంచిన 14 ట్రాక్టర్ల ఇసుకను పట్టుకుని సీజ్ చేశామని, ఈ ఇసుకను ఈ నెల 16న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేస్తామని తహసీల్దార్ జానకి వివరించారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు ప్రారంభ ధర రూ. 1800 ఉంటుందని ఆసక్తి గల వారు పై తేదీన ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

ఏఎస్పీని కలిసిన ట్రస్మా నాయకుడు



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఏఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డిని జిల్లా ట్రస్మా అధ్యక్షుడు జి. శ్రీనివాస్‌గౌడ్ గురువారం మర్యాద పూర్వ కంగా కలుసుకున్నారు. ఆయనను శాలువా, పూలబొకేతో సన్మా నించారు. సోన్ మాజీ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.

సమస్యలను ఆచితూచి ఎదుర్కోవాలి

తానూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితంలో సమస్యలు సహజమని వాటిని ఆచితూచి ఎదుర్కోవాలని ఎస్సై రమేష్ అన్నారు. గురువారం మండలంలోని మహాలింగి గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సమాజంలో ఆత్మహత్యలు పెరిగిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మీకు ఎలాంటి బాధలు ఉన్న పక్కవారితో పంచుకోని, సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. జీవితం ప్రతి మనిషి కి ఒక అవకాశాన్ని ఇస్తుందని, అవకాశాలను అందుకొని ముందుకు సాగిపోవాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుకోవాలన్నారు. అపరిచితులకు ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని పేర్కొన్నారు. ఏవయిన సమస్యలు ఉంటే 100కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులున్నారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల
ఫోరమ్ అధ్యక్షుడి నియామకం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల ఫోరమ్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఆర్. రత్నం నియమితులయ్యారు. ఆల్ ఇండియా ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. న్యాయవాదులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రత్నం తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఆయనను సన్మానించారు. దేవిదాస్ రెడ్డి, తుకారాం, రమణ, నూనె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.